క్లుప్తంగా

హక్కులపై అవగాహన ఏర్పరచుకోండి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి



చిలకలూరిపేట: రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, విధుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీజీ సీజే కోర్టు ప్రాంగణంలో భారత రాజ్యాంగ దినోత్సవం, న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పట్ల అవగాహన లేక ప్రజలు తమకు లభించాల్సిన హక్కులను కోల్పోతున్నారని వెల్లడించారు. రాజ్యాంగంతో పాటు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో వరకట్నం అనే దురాచారం సమసిపోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. దీనికి ఉదాహరణ రోజురోజుకు వరకట్న కేసులు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ కట్నం తీసుకోవడాన్ని నిరాకరించాలన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

చిలకలూరిపేట: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ చెప్పారు. ఏపీ సోషల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏఎంజీ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి బయట కొనసాగే విద్యార్థులను బడిలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిప్యూటీ డీఈవో కె.వేణుగోపాలరావు,రిటైర్డ్ హెచ్‌ఎం బి.రామకోటేశ్వరరావు విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిలకలూరిపేట,యడ్లపాడు, ఎంఈవోలు కె.లక్ష్మీ, ఎన్.అరుణకుమారి, హెచ్‌ఎంలు ఐ కృష్ణానాయక్, కె.కృపాదానం, ఏపీ ఎస్ఎస్‌టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌లో ఉపాధి హామీ పథకంపై నియోజకవర్గ స్థాయి రివ్యూ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. సిద్ధ లింగమూర్తి పాల్గొని మాట్లాడుతూ కూలీలకు వంద రోజులు పని కల్పించాలని, కూలీల మస్టర్లు సక్రమంగా వేయాలని, గోకులాల షెడ్‌ల నిర్మాణం, పనుల ప్రణాళికలు, ఆమోదం, మెటీరియల్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవోలు, ఐదు మండలాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన బహిరంగ వేలం

నాదెండ్ల: రెవెన్యూ రికవరీ యాక్ట్‌లో భాగంగా గణపవరం గ్రామ పరిధిలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన బహిరంగ వేలం నిలిచిపోయింది. గ్రామానికి చెందిన బొప్పూడి వెంకటేశ్వర్లు భార్య నాగేంద్రమ్మకు చిలకలూరిపేట బైపాస్ రోడ్డు భూ సేకరణలో చెల్లించాల్సిన దాని కన్నా అధిక పరిహారం సొమ్ము రైతు ఖాతాకు జమ అయింది. అధికంగా చెల్లించిన రూ.1,68,347లు సొమ్మును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలని నోటీసులు జారీ చేశారు. భూ యజమాని నుంచి స్పందన లేకపోవటంతో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వారికి చెందిన గణపవరం గ్రామ సర్వే నెం.5–3లోని తొమ్మిది సెంట్ల భూమిని బహిరంగ వేలం చేపట్టారు. అయితే మంగళవారం సంబంధిత భూయజమానులు ఇన్‌చార్జి ఆర్‌ఐ సాంబశివరావు, వీఆర్వోలు ఆదిలక్ష్మీ, అంకమ్మరావులను కలిసి నగదు చెల్లించటంతో వేలం నిలిచిపోయింది.

చట్టాలు తెలుసుకుంటేనే హక్కుల్ని సాధించగలం

యడ్లపాడు: పిల్లలకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు గురువులపై ఉందని హెచ్‌ఎం జి.వి జయభారతి చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు జెడ్పీహైస్కూల్లో మంగళవారం జెండర్ క్యాంపైన్ నయిచేతన 3.0 కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఫ్లెక్సీలను పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాఠశాలలో లింగవివక్షత, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్, బాలల హక్కులు, బాలల అక్రమ రవాణ, లైంగిక వేధింపులు, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ డీపీఎం డీబీ ప్రయదర్శిని, ఏపీఎం కె.రవీంద్రకుమార్, సీసీ బి.పేరమ్మ, వీఏవోలు పాల్గొన్నారు.

క్యాడెట్స్‌కు సర్టిఫికెట్ల ప్రదానం

నరసరావుపేట రూరల్: విద్యార్థుల్లో జాతీయ సమైఖ్యత, మానసిక పరిపక్వత సాధించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు తెలిపారు. జాతీయస్థాయి శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్ల అభినందన కార్యక్రమం మంగళవారం కళాశాలలో నిర్వహించారు. బెస్ట్ క్యాడేట్ అవార్డు అందుకున్న జేయువో పి.నిహారికను, రాజస్థాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కామెల్ సఫారి క్యాంప్‌లో పాల్గొన్న సీనియర్ క్యాడేట్స్ ఎం.హేమంత్, ఎన్.సాహిత్యరెడ్డి, కర్ణాటకలో జరిగిన వైట్ వాటర్ రాఫ్టింగ్ క్యాంప్‌లో పాల్గొన్న మణిక కుమార్‌ను కార్యక్రమంలో అభినందించారు.

రైతుకు 'వర్రీ'!



ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో మట్టిపాలు అవుతుందని రైతు పడుతున్న అవస్థలు చూస్తుంటే చూపురలను కలచివేస్తుంది. గత ఏడాది సాగు నీరు లేక వరి సాగు నిలిచింది. అయితే ఈ ఏడాది ఉత్సాహంగా రైతులు వరి సాగు చేశారు. పంట మార్పిడి వల్లనైతేనేమి, వాతావరణం అనుకూలించడం వల్లనైతేనేమి వరి ఈ ఏడాది ఏపుగా పెరిగి కంకులీనింది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు, గాలులకు ఏపుగా పెరిగిన ఈ వరి ప్రస్తుతం నేలవాలింది. దీంతో చేసేదిలేక నేలవారిన వరి పైరును పైకి లేపి నాలుగైదు వరి దిబ్బులతో కట్టలుగా కట్టి కంకులు నేలపాలు కాకుండా చేస్తున్న ప్రయత్నాలు, వారు పడుతున్న అవస్థలు చూస్తే పలువురికి జాలివేస్తోంది.

– రొంపిచర్ల

సేవలు ఆరంభించాలి!



ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయినా సంతగుడిపాడులోని ఆరోగ్య కేంద్రం ఇంకా ఆరంభానికి నోచుకోలేకపోతోంది. అనారోగ్యంలో ఉన్న రోగులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా ఎందుకో యంత్రాంగం దీనిపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి. గ్రామంలో సుమారు 7 వేల మంది ప్రజలు ఉన్నారు. వీరందరికీ వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.21 లక్షల రూపాయలు వెచ్చించి విలేజ్ క్లినిక్ సెంటర్‌ను నిర్మించారు. వైద్యాధికారులు గ్రామంలో ఏదో ఒక చోట నుంచి వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని సౌకర్యాలు ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–రొంపిచర్ల

కత్తెర తొలగిస్తేనే...



మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు నివారణకు విషపు ఎర ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ పి.సంధ్యారాణి చెప్పారు. సాతులూరు గ్రామంలో మంగళవారం గ్రామ రైతులకు గ్రామీణ వ్యవసాయ కృషి, అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తెర పురుగు నివారణకు తవుడు, బెల్లంలో డయోడికార్బ్ మందును కలిపి ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో చల్లితే కత్తెర పురుగు నివారించుకోవచ్చన్నారు. దీంతో దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రామారావు పాల్గొన్నారు.

–నాదెండ్ల

మూడు ఇళ్లలో చోరీ

నాదెండ్ల: తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. తాజాగా మండలంలోని గొరిజవోలు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎస్సై పుల్లారావు తెలిపిన వివరాల మేరకు మాజీ సర్పంచ్ పోపూరి మస్తాన్‌రావు, దివ్వె కోటేశ్వరరావు, వల్లూరి సత్యనారాయణ ఇళ్లలో సుమారు రూ.2 లక్షల విలువైన వస్తువులను దుండగులు దోచుకెళ్లారు. పోపూరి మస్తాన్‌రావు కుటుంబ సభ్యులు సోమవారం బంధువుల ఇంటికి వెళ్లగా అదే సమయంలో తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ.70 వేలు నగలు, 1.5 సవర్ల బంగారు వస్తువులు చోరీ చేశారు. దివ్వె కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు విదేశాలకు వెళ్ళటంతో ఆ ఇంటి తలుపులు పగలగొట్టిన దొంగలు వెండి వస్తువులు దోచుకెళ్లారు. వల్లూరి సత్యనారాయణ నివాసంలో తలుపులు పగలగొట్టి వెళ్ళిన దొంగలు, విలువైన వస్తువులు లేకపోవటంతో వెనుదిరిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈపూరులో రెండు దుకాణాల్లో చోరీ

ఈపూరు(నూజెండ్ల): మండల కేంద్రం ఈపూరు గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్నటువంటి రెండు దుకాణాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు వివరాలు మేరకు మహాలక్ష్మి పెయింట్ షాపు రూ. ఒక లక్ష 20 వేలు పరిమళ ఎరువుల దుకాణాల్లో రూ.20 వేలు నగదు చోరీకి గురైనట్లు దుకాణ యజమానులు తెలిపారు. సీసీ కెమెరాలు హర్డ్ డిస్క్‌లను సైతం చోరీ చేయడం విశేషం. మెయిన్ రోడ్డు పరిధిలో చోరీలు జరగటం పట్ల ప్రజలు పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

బొల్లాపల్లి: మండలంలో రేషన్ షాపు డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రేషన్‌షాపులకు సంబంధించిన డీలర్లు మరణించడం, షాపుల విభజన వల్ల ఏర్పడిన ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన నియామకం చేయనున్నట్లు తెలిపారు. మేళ్లవాగు ఎస్సీ, రావులాపురం బీసీసీ, సీతారామపురంతండా ఓసీ అభ్యర్థులు డిసెంబరు 4వ తేదీ సాయంత్రం 5గంటల లోపు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబరు 9న రాత పరీక్ష, 11న మౌఖిక పరీక్ష, 16న నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ వివరించారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

రొంపిచర్ల: పంటల బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ పి.మస్తానమ్మ అన్నారు. మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యాక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీమా చేసిన రైతాంగానికి అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటకు బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే మొక్కజొన్న పైరుపై వస్తున్న చీడపీడలు, నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివలలిత, వీఏఏ శ్రీకాంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నూరుశాతం ఈ-పంట నమోదు చేయాలి

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, కొత్తలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూరు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దినేని శివకుమారి పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజనుల్లో పంటలు సాగు చేసిన రైతులందరు ఈ-పంట నమోదులో వ్యవసాయ అధికారులకు తమవంతు సహకారం అందించాలన్నారు. పంటల కొనుగోలు సమయంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చర్యలు తీసుంటుందన్నారు. డిసెంబరు నెలాఖారులోగా గడువు ఉందని నూరు శాతం అయ్యేలా రైతుసేవా కేంద్రం వీఏఏలు బాధ్యత వహించాలన్నారు. ప్రధానమంత్రి ఫసలీ బీమా యోజన పథకంలో వరి పంట సాగు చేసిన రైతులందరు ఒక్కో ఎకరానికి రూ. 630 చెల్లిస్తే తద్వారా పంటలు దెబ్బతిన్న సమయంలో ఒక్కో ఎకరానికి రూ. 42 వేలు బీమా వర్తించుతుందన్నారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులతో మాట్లాడి తెగుళ్ల సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాజీవనం అస్తవ్యస్తం

- అంబేడ్కర్ రాజ్యాంగం ఎక్కడా అమలు కావట్లేదు
- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి
- అంబేడ్కర్‌కు ఘన నివాళి

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్నది అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం కాదని, లోకేష్ రాసిన రెడ్ బుక్ రాజ్యాంగమే నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. 75వ భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాలకు హక్కులు, కేంద్ర పరిపాలన విధానం గురించి ఏడుగురు సభ్యులతో కూడిన డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా మహానేత అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రెండున్నర సంవత్సరాల కాలం పాటు రచించారని, 1949 నవంబర్ 26వ తేదీన రాష్ట్రపతి ఆమోదం పొందడం జరిగింది చెప్పారు. 1950 జనవరి 26న పార్లమెంట్లో పెట్టి భారతదేశాన్ని రిపబ్లిక్ దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని అవహేళన చేసేలా మంత్రి లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం ఉందన్నారు. దీనివల్ల ఈ రోజు సబ్‌జైలులో 91 మంది ఉంటే అందులో 70 మంది ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెందినవారే ఉన్నారన్నారు. ఇకనైనా లోకేష్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఆదర్శంగా తీసుకొని పరిపాలన జరగాలని ఆకాంక్షించారు. విశాఖ సెంట్రల్ జైలులో మొత్తం ఖైదీలతో నిండిపోయిందని పత్రికల్లో చూశామని, ఈ పరిస్థితికి కారణం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగమే అన్నారు. ఎంపీలు ఎమ్మెల్యేలు సోషల్ మీడియా కార్యకర్తలు ఎవరైనా ఈ ప్రభుత్వం గురించి మాట్లాడితే వారిపైన కేసులు పెట్టి చిత్రహింసలు పెడుతున్నారని అన్నారు. ప్రజలందరూ గమనిస్తున్నారని, వారిని ఏమాత్రం క్షమించరని, తగిన గుణపాఠం చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్‌లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్.సుజాతపాల్, పార్టీ నాయకులు గంటనపాటి గాబ్రియల్, కుక్కల పౌలు, కె.చిన్న, కంచర్ల ప్రసాద్, కోట చిన్నబాబు, తురక నాగుల్ మీరా, పాతర్ల చిన్ని, బూదాల కళ్యాణ్, రుక్మిణి బాబు, నేలటూరి సురేష్, మొగిలి ఆంజనేయులు, ఖాజావలి పాల్గొన్నారు.



నరసరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

చిలకలూరిపేట టౌన్: భారత రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి ఒక్కరిపై ఉందని జేఎస్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహా రావు తెలిపారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 75వ రాజ్యంగ దినోత్సవ వేడుకల్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

నరసరావుపేట ఈస్ట్: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం పట్టణంలోని విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. భారత పార్లమెంట్‌లో 1949 నవంబర్ 26వతేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును పురస్కరించుకొని భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్టు వక్తలు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహనరావు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.అనిల్‌కుమార్, ఊటుకూరి స్వామి పాల్గొని రాజ్యాంగ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. గుంటూరు రోడ్డులోని కే–రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్ తదితరులు పాల్గొని రాజ్యాంగ నమూనా విడుదల చేశారు.

నరసరావుపేట రూరల్: ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులని న్యాయవాది బి.సలీం తెలిపారు. ఎంఏఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సలీం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు కావడంతో హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్ నినాదంతో ఏడాది పొడవునా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరి రావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.వీరబ్రహ్మం, డాక్టర్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.రామారావులు పాల్గొన్నారు.



ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్

రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్గించే విధంగా ఉపన్యాసాలు చేశారు. అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, డిబేట్, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రొంపిచర్ల జెడ్పీ పాఠశాల విద్యార్థులు డీబీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ స్ఫూర్తి యాత్ర నిర్వహించారు. చెరువు గట్టు సెంటర్‌లో మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎండీవో మాధ్యుబాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్, డీబీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్, హెచ్‌ఎం బి.యం. సుభాని, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి : మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవవేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ వి. పద్మావతి, పేరూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మస్తాన్‌బీలు రాజ్యాంగ పీఠిక, హక్కులు, విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శావల్యాపురం: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరుపుకోవటం మంచి శుభపరిణామమని వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో నియోజకవర్గ స్థాయిలో 6 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వ పోటీలను నిర్వహించారు.



కే–రెడ్డి పాఠశాలలో ప్రతిజ్ఞలో పాల్గొన్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎన్ నరసింహా రావు

వినుకొండ(నూజెండ్ల): రాజ్యాంగం ప్రచార వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దిన వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ జుజ్జూరి ఐరామ్మూర్తి, న్యాయవాదులు పీజే లూకా, దుగ్గిపోగు విజయ్, ఉపాధ్యాయులు రామాచారి, ఎస్. రవికుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీహెచ్ఎస్, గీతమ్స్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అందజేయడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బి శ్రీనునాయక్, పి శ్రీనివాస రావు, కె నాగేశ్వరరావు, బి చిన్నానాయక్, ఎస్ నాగ రాజు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం 1వ సచివాలయం వద్ద మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. సభకు గ్రామ ప్రత్యేకాధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎస్ మారుతిబాబు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వలేటి హిమవంతరావు, పెనుమల జాన్‌బాబు, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు, న్యాయవాది తూబాటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలు వెలికితీయాలి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ జరిగిందన్నారు.

దీనిపై రెవెన్యూ శాఖ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెండు నెలల క్రితం ఆదేశించినా ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. పనిఒత్తిడి ఉన్నా ప్రభుత్వ భూముల ఆక్రమణ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో సైతం ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు కూడా స్థలాలు లేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను వెలికి తీయడం ద్వారా అయా స్థలాలను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పథకాన్ని తీసుకు వస్తుందని తెలిపారు. బోర్లు అవసరమైన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ఖాళీ భూముల్లో మొక్కలు పెంచాలి

నరసరావుపేట రూరల్: ఖాళీగా ఉన్న భూములలో అటవీ జాతి మొక్కలను పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు ఆదాయం లభిస్తుందని అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రణీత్‌వర్మ తెలిపారు. మండలంలోని కాకానిలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రణీత్‌వర్మ, వీపీఏబి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణీత్‌వర్మ మాట్లాడుతూ ఉద్యాన, అటవీజాతి మొక్కలు వ్యవసాయ భూమిలో నాటితే దాని వలన వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయాన్ని తెలియజేశారు. గట్టుల పైన, ఖాళీగా ఉన్న పొలాల్లో టేకు, ఎర్రచందనం, సరుగుడు వంటి మొక్కలు పెంచడం ద్వారా 20 సంవత్సరాలు తరువాత రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పలనేని వీరవసంతరావు, రాయపాటి వెంకటేశ్వర్లు, సీసీ వెంకటేష్, అనిల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రణీత్‌వర్మ

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

వినుకొండ(నూజెండ్ల): అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో మద్యం అమ్మకాలు అక్రమంగా నిర్వహిస్తున్న ఒక వ్యక్తి అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా మద్యం తీసుకువచ్చి అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు ఏమైనా సమాచారం తెలిసినా ఎక్సైజ్ సిబ్బంది అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు వినీలా, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులూ.. దుర్వ్యసనాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చిలకలూరిపేట: విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సీఐ పి.రమేష్ చెప్పారు. పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితాలు సర్వనాశనం అవుతాయని వెల్లడించారు. అనారోగ్య సమస్యలతో పాటు ఉజ్వల భవిష్యత్ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వెల్లడించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని చెప్పారు.

విద్యార్థులు సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులతో పాటు సమాజంలో అవగాహన పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు షేక్ రహంతుల్లా, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చిలకలూరిపేట: కొనుగోలు కేంద్రానికి తెచ్చే పత్తిలో పరిమితికి మించి తేమ శాతం లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. మండలంలోని కమ్మవారిపాలెం, గోవిందపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నాణ్యాతా ప్రమాణాలు తగినట్లుగా లేని పక్షంలో కొనుగోలు కేంద్రంలో పత్తిని కొనడం సాధ్యం కాదన్నారు. శనగలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా ఉపయోగించాలని చెప్పారు.

భవన యజమానులపైనే చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేస్తున్నందుకు ప్లాన్లు తయారుచేసి ఇచ్చే మున్సిపల్ లైసెన్స్‌డు ఇంజినీర్లను బాధ్యులను చేస్తూ క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ ప్రకటించటం విడ్డూరంగా ఉందని నరసరావుపేట లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ సంక్షేమ సంఘం (యల్.టి.పి) అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. మంగళవారం సంఘ అధ్యక్షులు రాయిడి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో సమావేశం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు ప్లాను అనుమతులు డిసెంబర్ 31వ తేదీ నుంచి సింగిల్ విండో విధానం ద్వారా సులభతరం చేస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి ప్రకటించటం మంచి శుభపరిణామమన్నారు. అయితే ఎవరైతే భవన నిర్మాణ అనుమతులు తిసికొని ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారో వారిని వదిలి ఎవరైతే ప్లాన్లు తయారు చేసి అనుమతులు ఇప్పించే మమ్మల్ని బాధ్యులని చేస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని, లైసెన్స్ కూడా రద్దు చేస్తామనటం సరైన నిర్ణయం కాదు అన్నారు. రాష్ట్ర ఇంజినీర్స్ అసోసియేషన్ సంక్షేమ సంఘ నేత బొందిలి శ్రీనివాస్‌సింగ్, కొమ్మసాని కమలాకరరెడ్డి, జి పి రంగయ్య, మురారి ఆంజనేయులు, అబ్దుల్ కరీం, అనిల్ కుమార్ పాల్గొన్నారు.